సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 4 । మార్చి । 2023





**చేనేత స్థితిగతులపై అధ్యయనం**
హైదరాబాద్‌లోని సిటీ కాలేజీ విద్యార్థులు చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై అధ్యయనం చేశారు.
- 10లో



**గణితం కీలకం**
మానవాళి మనుగడకు గణితశాస్త్రం కీలకమని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
33° / 24°

**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

**వలిగొండ :** మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం వలిగొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థిక సాధికారత సాధించాలన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులపట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో 100 నంబర్‌కు సమాచారం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శైలజ, వైద్యాధికారి జ్యోతి, సర్పంచ్ బోళ్ల లలితాశ్రీనివాస్, ఎంపీటీసీ కుందార యశోద కొమురయ్య, సూపర్‌వైజర్ సువర్ణ, ధనమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### యాదాద్రిలో ఊంజలి సేవ


ఊంజలి సేవ నిర్వహిస్తున్న ఆచార్యులు

**యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాల్ అమ్మవారి తిరువీధి, ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో సేవోత్సవం చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి ఆచార్యులు విశేష పూజలు నిర్వహించారు.

### 10న జెడ్పీ సమావేశం

**భువనగిరిటౌన్ :** జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10న ఉదయం 10.30కి నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం


బాధితుడు శేఖర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

**చౌటుప్పల్ :** పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. చౌటుప్పల్ పట్టణంలో అగ్నిప్రమాదానికి గురైన జైకేసారానికి చెందిన వార్డు సభ్యుడు మాదగోని శేఖర్‌గౌడ్ దుకాణాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. శేఖర్‌ను ఓదార్చారు. రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆపదలో ఉన్న కాంగ్రెస్ కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వలిగొండ ఎంపీపీ రమేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి సుర్వి నర్సింహగౌడ్, నాయకులు ముప్పిడి సైదులుగౌడ్, బోయ రామచంద్రం, దేవేందర్, నర్సింహ, రాజేందర్, బీమయ్య, ప్రదీప్‌జీ, యాదగిరి పాల్గొన్నారు.

### చెరువును పరిశీలించిన ఐబీ డీఈ


చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న డీఈ

**రాజాపేట :** మండలంలోని చల్లూరులో మల్వాని చెరువు సమీపంలో మట్టి తరలిస్తున్నారని, చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు చేసిన ఫిర్యాదుకు మేరకు ఐబీ డీఈ రూప్లానాయక్ శుక్రవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మట్టి తరలించకుండా చూస్తామని, చెర్వు తూము మూసివేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఏఈ విజయ్, రైతులు బొంత సుధాకర్, కోట ఎల్లయ్య, వార్డు సభ్యులు ఉన్నారు.

### నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్

**బీబీనగర్ :** విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న నలుగురు ఉపాధ్యాయులకు డీఈఓ నారాయణరెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఆయన బీబీనగర్, వెంకిర్యాల జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు నిర్వహించిన ప్రీఫైనల్ పరీక్ష ఫలితాలను పరిశీలించారు. మార్కులు తక్కువగా రావడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీబీనగర్‌లో ఇద్దరు, వెంకిర్యాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

## పెంచిన గ్యాస్ ధర తగ్గించాల్సిందే


ఆలేరులో వంటావార్పు నిర్వహించి నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, ప్లకార్డు ప్రదర్శిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

**ఆలేరురూరల్ :** ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలపై మోదీ సర్కార్ గ్యాస్ ధర పెంచి భారం మోపిందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత విమర్శించారు. కేంద్రం పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా శుక్రవారం ఆలేరులోని బస్టాండ్ వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏడాదిలో మూడు, నాలుగు సార్లు గ్యాస్ సిలిండర్ ధర పెంచుతూపోతే సామాన్య ప్రజలు ఎలా బతకాలన్నారు. పెంచిన గ్యాస్ ధరలు తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు పుట్ట మల్లేషం, గంగుల శ్రీనివాస్, వైస్ చైర్మన్ మాధవివెంకటేష్, కౌన్సిలర్లు కందుల శ్రీకాంత్, బేతిరాములు, నర్సింహులు, దాసి నాగలక్ష్మి, దాసి సంతోష్, భాలస్వామి, పూల శ్రవణ్, ఐలి కృష్ణ, బానుప్రసాద్, పంతం కృష్ణ, కుండె సంపత్, పత్తి వెంకటేష్, సీసా మహేశ్వరి, క్యాసగల్ల అనసూయ, సర్పంచ్‌లు, టీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు, పాల్గొన్నారు.

## సామాన్యుడి నడ్డి విరిచిన మోదీ సర్కార్


కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

**భువనగిరి :** మోదీ సర్కార్ వంట గ్యాస్ ధర పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భువనగిరిలోని ప్రిన్స్‌కార్నర్ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వంటావార్పుతో నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సర్కార్ అధికారంలోకి రాక ముందు సిలిండర్ ధర రూ.400 ఉంటే ప్రస్తుతం రూ.1200కు చేరిందన్నారు. ప్రజలు గ్యాస్‌పై వంట చేసుకునే స్థితిలో లేరన్నారు. పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, ఎంపీపీ నరాల నిర్మల, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పెంట నర్సింహ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

# అనుమతి పేరుతో అక్రమం

**జోరుగా ఇసుక అక్రమ దందా**
- ప్రభుత్వ పథకాలు, ఇళ్ల నిర్మాణం కోసం పర్మిషన్
- పరిమితికి మించి ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలింపు
- రహస్య ప్రాంతాల్లో డంప్.. హైదరాబాద్‌కు రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు

**సాక్షి, యాదాద్రి :** అక్రమార్కులు వాగులు, వంకలను వదలకుండా ఇసుక తోడేస్తున్నారు. రాత్రి, పగలు ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తూ దర్జాగా దందా సాగిస్తున్నారు. అరికట్టాల్సిన అధికార యంత్రాంగం ఉదాసీనత ప్రదర్శిస్తోంది. జిల్లా, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన విజిలెన్స్ కమిటీలు సైతం సైలెన్స్ అయిపోయాయి. అధికార పార్టీ, అధికారుల అండదండలతో మామూలుగా తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

**అభివృద్ధి పనులు సాకుగా చూపి**
ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు, ప్రాజెక్టులు, స్థానిక ప్రజల అవసరాల నిమిత్తం ఇసుక కోసం కాంట్రాక్టర్లు, ట్రాక్టర్ల యజమానులు రెవెన్యూ శాఖ నుంచి అనుమతి పొందుతున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే వాగుల్లో నుంచి ఇసుక తరలించాల్సి ఉంది. కానీ, పరిమితికి మించి ఇసుకను రవానా చేస్తున్నారు. ఉదాహరణకు నాలుగు ట్రిప్పులకు అనుమతి ఇంటే అంతకుమించి తరలిస్తున్నారు. ఈ దందా నిరాటంకంగా సాగుతోంది.

**మూసీని తోడేస్తున్నారు**
మూసీ పరీవాహక మండలాల్లో ఇసుక దందా జోరుగా సాగుతోంది. రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం, శోభనాద్రిపురం, లక్ష్మాపురం,


ఆలేరు పెద్దవాగు నుంచి తరలించడానికి సిద్ధంగా ఇసుక బస్తాలు

పల్లివాడ, బాచుప్పల కేంద్రాలుగా వ్యాపారం సాగుతోంది. మోత్కూరు మండల పరిధిలో మూసీ వాగు నుంచి రోజూ వంద ట్రాక్టర్లకు పైనే అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పొడిచేడు, దత్తప్పగూడెం, పాలడుగు, దాచారం గ్రామాల మీదుగా ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. వలిగొండ మండలంలోని గోకారం, ప్రొద్దటూరు, వేములకొండ, వలిగొండ పరిధిలోని మూసీ, వాగుల నుంచి రేయింబవళ్లు ఇసుక తరలిస్తున్నారు. మండల వ్యాప్తంగా 60 నుంచి 70ట్రాక్టర్ల ద్వారా నిరంతరం


అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

ఇసుక రవాణా జరుగుతోంది.

**వాగులూ ఖాళీ**
జిల్లాలో ప్రధాన వాగులైన బిక్కేరు, ఆలేరు పెద్ద వాగులను ఇసుకాసురులు వదలడం లేదు. మోత్కూరు మండలం కొండగడప, సదర్శాపురం, ఆత్మకూరు(ఎం) మండల పరిధిలోని మొరిపిరాల, కామునిగూడెం, రహీంఖాన్‌పేట, అడ్డగూడురు మండలంలో అజీంపేట, జానకీపురం, చిన్నపడిశాల, కోటమర్తి, గుండాల మండలం బండకొత్తపల్లి, అనంతారం, మాసాన్‌పల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల పరిధిలో ఉన్న బిక్కేరు వాగునుంచి రోజూ వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఇక రాజాపేట మండలంలో పాముకుంట, పారుపల్లి, దూదివెంకటాపురం, రఘునాథపురం, చల్లూరు, కాల్వపల్లి, బేగంపేట పరిధిలో ఉన్న వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా నిత్యకృత్యంగా మారింది. ఆలేరు మండలంలో కొలనుపాక, బైరాంనగర్, గొలనుకొండ, తూర్పుగూడెం, మంతపురి శారాజీపేట, కొల్లూరు, పటేల్‌గూడెం, శ్రీనివాసపురం, టంగుటూరు, రాఘవాపురం, యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట, కాచారం, ధర్మారెడ్డిగూడెం, మల్లాపురం పరిధిలో విస్తరించి ఉన్న పెద్దవాగు నుంచి రేయింబవళ్లు ఇసుక తరలిస్తున్నారు.

**అందరికీ ముడుపులు!**
ఇసుక తరలిస్తున్న వ్యక్తులు తమ వ్యాపారం సాఫీగా జరగడానికి అటెండర్ నుంచి అధికారుల వరకు ప్రతి నెలా ముడుపులు ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది.

**గ్రామాల్లో ఘర్షణలు**
ఇసుక వ్యాపారం గ్రామాల్లో చిచ్చుపెడుతోంది. అధికార, ప్రతిపక్షపార్టీల నాయకులు పోటీ పడి ఇసుకను తరలిస్తున్నారు. వీరు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసి ట్రాక్టర్లను పట్టిస్తున్నారు. అంతేకాకుండా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఆలేరు మండలం కొలనుపాకలో ఇసుక రవాణాను రైతులు అడ్డుకున్నారు. అడ్డగూడురు, గుండాల, ఆలేరు, వలిగొండ, ఆత్మకూరు(ఎం) మండలాల రైతులు రెవెన్యూ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు.

**విచారణకు ఆదేశించాం**
“ఇసుక కోసం అనుమతి పొందిన వారు ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల లోపు మాత్రమే రవాణా చేయాలి. ఇసుక అక్రమ రవాణాపై పలు చోట్ల ఫిర్యాదులు రాగా విచారణకు ఆదేశాం. కఠినంగా వ్యవహరించాలని సాండ్ కమిటీని ఆదేశించాం.
-పమేలా సత్పతి, కలెక్టర్


ఆలేరు సమీపంలో డంప్ చేసిన ఇసుక

**డంప్ చేసి.. సరిహద్దులు దాటిస్తూ**
మూసీ, బిక్కేరు, ఆలేరు పెద్దవాగుతో పాటు ఇతర వాగుల నుంచి తరలించిన ఇసుకను రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. రాత్రి వేళ లారీల్లో హైదరాబాద్ తరలిస్తున్నారు. వేబిల్స్ లేకుండా ఇసుక తరలిస్తున్నా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం వాటి వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

## పల్లెప్రగతితో గ్రామాల వికాసం

- కలెక్టర్ పమేలా సత్పతి
- 11 రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం


మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

**సాక్షి,యాదాద్రి :** పల్లెల వికాసానికి పల్లెప్రగతి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతున్నాయని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం 11 రాష్ట్రాల నుంచి వచ్చిన సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన అధికారుల బృందంతో కలెక్టరేట్‌లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై కలెక్టర్ వారికి వివరించారు. సంపద్ ఆదర్శ గ్రామీణ యోజనలో జిల్లాలోని వడపర్తి, కొలనుపాక గ్రామాలు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచాయన్నారు. పల్లెప్రగతిలో భాగంగా పంచాయతీలకు ప్రభుత్వం ట్రాక్టర్లు ఇచ్చిందని, పచ్చదనం, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపడుతున్నట్లు వివరించారు. నర్సరీలు ఏర్పాటు చేసిన హరితహారం కోసం మొక్కలు పెంచుతున్నామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం స్వయం సహాయక మహిళా సంఘాలకు 100 శాతం బ్యాంకు లింకేజీ రుణాలిచ్చి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపినట్లు వెల్లడించారు. వడపర్తిలో సుకన్య సమృద్ధి యోజన కింద వంద శాతం ఖాతాలు తెరిచినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభల ఏర్పాటుతో మాతాశిశు సంరక్షణ, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. యాదాద్రి క్షేత్ర పునర్నిర్మాణం అద్భుతంగా జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి, ప్రత్యేకాధికారులు బృందం సెక్రటరీ కైలాస్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లఖన్‌సింగ్, ప్రాజెక్ట్ మానిటరింగ్ ఆఫీసర్ ప్రదీప్తశేఖర్ పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం**


యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవారి దోలోత్సవం

## వడపర్తిని సందర్శించిన ఎన్‌ఐఆర్‌డీ బృందం

- గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధ్యయనం


గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

**భువనగిరి :** సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన పథకం కింద ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామాన్ని శుక్రవారం ఎన్‌ఐఆర్‌డీ(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్) బృందం సందర్శించింది. రెండు రోజుల శిక్షణలో భాగంగా 11 రాష్ట్రాలకు చెందిన 80 మంది చార్జ్ ఆఫీసర్లు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, శ్మశానవాటిక, నర్సరీ, మహిళా సమాఖ్య భవనం, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, డంపింగ్ యార్డును పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంపీ కోమటిరెడ్డి ఎస్‌ఏజీవై పథకం కింద గ్రామాన్ని దత్తత తీసుకున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన నిధులు, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామ అభివృద్ధి వివరాలను చార్జి ఆఫీసర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మందడి ఉపేందర్‌రెడ్డి, అడిషనల్ డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఎంపీడీఓ గుత్తా నరేందర్‌రెడ్డి,ఎంపీఓ అనురాధదేవి, కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం


గోవులను పరిశీలిస్తున్న అసోం వ్యవసాయ అధికారులు

**తుర్కపల్లి :** అసోం రాష్ట్ర వ్యవసాయ అధికారుల బృందం శుక్రవారం తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి పరిధిలో గల అరుణ్ తేజ్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించింది. ఐదు దొంతుల పద్ధతిలో చేపడుతున్న 125 రకాల పండ్ల చెట్ల పెంపకం, ప్రాచీన ఎద్దు గానుగతో పల్లి, కొబ్బెర, నువ్వులు, కుసుమ, ఆవాలు, నూనెలను సంప్రదాయ పద్ధతులతో తయారు చేయడం గురించి క్షేత్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసే విధానంపైనా వారు ఆరా తీశారు. సుభాష్ పాలేకర్ విధానం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌తేజ్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రం యజమానులు డేగల సుధాకర్, డేగల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి బడ్జెట్ రూ. 50.72 కోట్లు

- గత ఏడాది కంటే తక్కువ
- 6న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న అధికారులు


భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయం

**భువనగిరి :** 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి గాను భువనగిరి మున్సిపల్ బడ్జెట్‌ను రూ.50.72 కోట్ల భారీ అంచనాలతో అధికారులు రూపొందించారు. ఆమోదం కోసం ఈనెల 6న కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే బడ్జెట్ కాపీలను కౌన్సిలర్లకు అందజేశారు. రూ.50.72 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనాలు వేయగా ఇందులో ప్రభుత్వ గ్రాంట్ల రూపంలో రూ.31.12 కోట్లు వస్తుందని నమోదు చేశారు. ఇక వివిధ అవసరాల నిమిత్తం రూ.50.77 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో రూ.51 కోట్లతో బడ్జెట్ అంచనా రూపొందించగా ఈసారి రూ.50.72 కోట్లుగా అంచనా వేశారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి రూ.28లక్షలు తక్కువతో బడ్జెట్ రూపొందించారు.

**సమావేశం జరిగేనా?**
బడ్జెట్ ఆమోదం కోసం ఈ నెల 6న మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికే మున్సిపల్ చైర్మన్‌పై ప్రతిపక్ష కౌన్సిలర్లతో పాటు ఇద్దరు అధికార పక్షం సభ్యులు మొత్తం 19 మంది సంతకాలు చేసి అవిశ్వాసం నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ సమావేశం జరుగుతుందా లేదా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. సమావేశాన్ని నిర్వహించాలంటే కోరం కింద 18 మంది కౌన్సిలర్లు ఉండాలి. అప్పుడే బడ్జెట్ ముసాయిదాపై చర్చ జరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లు బడ్జెట్ సమావేశానికి హాజరు కావద్దని నిర్ణయించుకున్నట్లు సమాచారం. రెండుసార్లు సమావేశానికి హాజరు కాని పక్షంలో కలెక్టర్ నేరుగా ఆమోదం తెలిపి ప్రభుత్వానికి పంపే అవకాశం ఉంది.

**అవిశ్వాసానికి మరికొందరు మొగ్గు**
కాగా అవిశ్వాస తీర్మానం కోసం ఇప్పటికే సంతకాలు చేసిన ప్రతిపక్ష, అధికార పక్ష కౌన్సిలర్లతో పాటు అధికార పక్షంలో మరి కొంతమంది అవిశ్వాసంపై మొగ్గు చూపుతున్నట్లు చర్చ జరుగుతోంది.

### మానవ విలువలు.. పర్యావరణం

- ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు నేడు, 6వ తేదీన పరీక్షలు

**భువనగిరి :** ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నైతికత మానవ విలువలు, ఈ నెల 6న పర్యావరణ విద్యపై పరీక్షలు జరగనున్నాయి. ఆయా కళాశాలల్లోనే పరీక్షలు నిర్వహించనున్నారు. 100 మార్కులకు గాను 60 మార్కులు పరీక్షకు, 40 మార్కులు ప్రాజెక్టు వర్క్‌కు కేటాయించారు. జిల్లాలో 69 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,206 మంది ఉన్నారు. జనరల్ విభాగంలో 4,684, ఒకేషనల్ 1,522 మంది ఉన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

**భువనగిరిటౌన్ :** అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట 36 గంటల దీక్ష చేపట్టారు. శుక్రవారం వంటావార్పు నిర్వహించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయ్యాయని విమర్శించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలని, హెల్త్ కార్డు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవిలో అంగన్‌వాడీ కేంద్రాలకు కుడా సెలవులివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బూరుగు స్వప్న, రమాకుమారి, భాగ్య, సునంద, అరుణ, సఫియా, పద్మ, సాహెద, శోభ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యాదాద్రిలో ఎన్నికల కమిషనర్ పూజలు



ఆలయ సన్నిధిలో ఎన్నికల కమిషనర్ పార్థసారథి

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి, కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనకువేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

### తూర్పు రాజగోపురం ఎదుట షెడ్డు ఏర్పాటు



తూర్పు రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన షెడ్డు

**యాదగిరిగుట్ట:** యాదాద్రి కొండపైన తూర్పు రాజగోపురం ముందు మండుటెండకు భక్తులు, ఆలయ సిబ్బంది ఇబ్బందులు పడవద్దని షెడ్డును ఏర్పాటు చేశారు. గతేడాది మార్చి 20న తూర్పు రాజగోపురం ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అవి వర్షానికి దెబ్బతినడంతో ప్రధానాలయం ముందే కాకుండా శివాలయానికి వెళ్తున్న మెట్ల మార్గంలో షెడ్డును బిగిస్తున్నారు.

### పుస్తెలతాడు చోరీ

**బీబీనగర్:** నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును దుండగులు చోరీ చేశారు. బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామానికి చెందిన దూడల యాదమ్మ ఈనెల 2న కొండమడుగులోని తన సోదరి దూసరి అంజమ్మ ఇంటికి వచ్చింది. శుక్రవారం గ్రామంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు సోదరితో కలిసి యాదమ్మ వచ్చింది. అనంతరం ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా మార్గమధ్యలో దుండగులు వెనుక నుంచి బైక్‌పై వచ్చి యాదమ్మ మెడలో 4తులాల పుస్తెలతాడును అపహరించుకుపోయారు. బాధితురాలి మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



108 కలశాలకు పూజలు చేస్తున్న ఆచార్యులు



శతఘటాభిషేకానికి పూజలు చేస్తున్న ఆచార్యులు

- అష్టోత్తర శతఘటాభిషేకం.. రాత్రి శృంగార డోలోత్సవం
- యాదాద్రిలో 11 రోజుల ఉత్సవాలకు వైభవంగా ముగింపు పలికిన ఆచార్యులు

**యాదగిరిగుట్ట:** పంచనారసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. 11 రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలకు ఆచార్యులు స్వామి అమ్మవార్లకు శృంగార మహోత్సవాన్ని నిర్వహించి ఉత్సవాలకు పరిసమాప్తి పలికారు. ఉదయం ఆలయంలో వైభవోపేతంగా శతఘటాభిషేకం పూజ జరిపించారు. ఈ విశేష వేడుకల్లో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ఏసీపీ సైదులు, ఆలయాధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.

**108 కలశాలతో...**

గత నెల 21వ తేదీన స్వస్తివాచనంతో యాద్రాద్రీశుడి బ్రహ్మోత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ఉదయం ప్రధానాలయ ముఖ మండపంలో 108 బంగారు, వెండి కలశాలను పూజించారు. ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అర్చకులు, యాజ్ఞాచార్యులు, పారాయణికులు పాంచరాత్ర ఆగమశాస్త్ర రీత్యా ఈ వేడుకను జరిపించారు. ప్రధాన కలశంతో పాటు 108 కలశాలను తొమ్మిది వరుసలుగా పేర్చి, ఒక్కో వరుసలో 12 కలశాలను పెట్టి పూజించారు. అంతకు ముందు ముఖ మండపంలో హోమం నిర్వహించి, పూర్ణాహుతి చేపట్టారు. శ్రీస్వామి అమ్మవార్లకు పంచామృతాలు, ఏలాలవంగాది చూర్ణ జలములతో, మంత్ర పూర్వక జపములతో అభిషేకించారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న యజ్ఞాచార్యులు, పారాయణికులు, అధికారులకు, సిబ్బందికి సన్మానం చేసి ఉత్సవ సమాప్తి సూచకంగా మంగళ నీరాజనములు అర్చక స్వాములచే నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

**ఆలయంలో రాత్రి**

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు నిత్యారాధనలు అనంతరం రాత్రి 9.30 గంటలకు స్వామి వారి శృంగార డోలోత్సవం జరిపించారు. కల్యాణ దంపతులైన స్వామి అమ్మవార్లను ఊయలలో వేంచేపు చేసి లాలి పాటలతో, భక్తి గీతములతో సంకీర్తన గావించారు. ఊయలలో పవళించిన స్వామి వారిని దర్శిస్తే సర్వ విధ దోషములు తొలగి భక్తుల మనోరథములు నెరవేరగలవని ఈ శృంగార డోలోత్సవ వేడుక నిర్వహించినట్లు ఆచార్యులు వెల్లడించారు. శాంతి, సుఖ, సౌజ్యములు కలుగునని ఆగమశాస్త్రాలు పేర్కొనుచున్నవి.

**ముగిసిన సాంస్కృతిక కార్యక్రమాలు**

ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం రాత్రి వైభవోపేతంగా ముగిశాయి. రాత్రి 9గంటల నుంచి లక్షణాదేవి బృందం స్వామివారి శృంగార డోలోత్సవంలో భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచార్యులు శృంగార డోలోత్సవం నిర్వహిస్తున్న సమయాన సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది.

**స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు**

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, సినీ నటుడు జగన్, యాదాద్రి భువనగిరి జిల్లా జడ్జి బాలభాస్కర్‌లు శుక్రవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు సంప్రదాయంగా వీరికి స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



స్వామివారి అభిషేకానికి సిద్ధం చేసిన కలశాలు



ప్రధాన కలశాన్ని తీసుకెళ్తున్న ఆచార్యులు, అనువంశిక ధర్మకర్త, ఈఓ

## ట్యాంకర్‌తో వరిపంటకు నీరు



తన పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతు శంకర్

**మునుగోడు :** ఎండల తీవ్రతకు అప్పుడే అక్కడక్కడ భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. మొన్నటి వరకు పుష్కలంగా నీరుపోసిన వ్యవసాయ బోర్లు ఒక్కసారిగా తగ్గిపోవడంతో రైతులు వరి పంటను కాపాడుకునేందుకు కష్టాలు పడుతున్నారు. ఒకపక్క విద్యుత్ కోతలు, మరోపక్క భూగర్భ జలాలు అడుగంటడంతో వరి పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళనచెందుతున్నారు. మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన రైతు కట్టికుంట్ల శంకర్ మూడు ఎకరాల్లో వరి సాగుచేశాడు. ఆ పంటకు రెండు బోర్ల నుంచి నీరు పెడుతున్నాడు. అయితే, తాను పంట సాగు చేసిన నెల రోజులకే బోర్లలో నీరు తగ్గుతూ వస్తుండటంతో ఇటీవల రూ.లక్షా 20వేలు ఖర్చు చేసి ఐదు బోర్లు వేశాడు. కానీ, ఏ ఒక బోరులోనూ చుక్క నీరు రాలేదు. దానికి ఉన్న రెండు బోర్లలో ఒకటి పూర్తిగా ఎండిపోయింది. దీంతో మూడు ఎకరాల్లో ఎకరంన్నర పొలానికి నీరు లేకుండా పోయింది. మరో నెల రోజులల్లో చేతికి వచ్చే పొలం ఎండిపోతే తనకు నయాపైసా రాదని, దానిని ఎలాగైనా కాపాడుకోవాలని శంకర్.. నెలకు రూ.15వేల చొప్పున ఓ వాటర్ ట్యాంకర్ అద్దెకు తీసుకున్నాడు. అందులో రోజుకు రూ.500 డీజిల్‌కు ఖర్చు చేస్తూ ట్యాంకర్‌లో నీరు నింపాకొని తీసుకొచ్చి తన పొలానికి పెడుతున్నాడు. ఇలాంటి పరిస్థితి మరికొంత మంది రైతులు కూడా ఎదుర్కొంటున్నారు.

## ఆలయ అధికారులపై భక్తుల ఆగ్రహం

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ అధికారుల తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం ఉదయం స్వామి అమ్మవార్లకు శతఘటాభిషేకం పూజను ఆచార్యులు నిర్వహించారు. ఈ సమయంలో భక్తులకు దర్శనాలను బంద్ చేశారు. అప్పటికే ఉదయం 9 నుంచి 10గంటల వరకు బ్రేక్ దర్శనాల కొనసాగుతుండటంతో ధర్మదర్శనాలు బంద్ చేశారు. 10 గంటలకు ధర్మదర్శనాలను కొనసాగించాల్సిన అధికారులు.. శతఘటాభిషేకం ప్రారంభం కావడంతో బంద్ చేశారు. అప్పటికే గంటల తరబడి క్యూలైన్‌లో భక్తులు నిల్చున్నారు. దర్శనాలు గంటల తరబడి బంద్ చేస్తే ఎలా అంటూ అక్కడున్న ఎస్‌పీఎఫ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం అధికారులకు భక్తులకు శ్రీస్వామి వారి దర్శనాన్ని కల్పించారు.

### ట్రాక్టర్ కిందపడి బాలుడు మృతి

**నేరేడుచర్ల :** ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన శుక్రవారం నేరేడుచర్ల మండలంలో చోటు చేసుకుంది. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాణామాదవ్ కొన్ని నెలలుగా దిర్శించర్ల శివారులో ఇటుకబట్టీలో పనిచేస్తున్నాడు. మాదవ్ కుమారుడు సన్మత్‌రాణా(5) బట్టీల వద్ద ఆడుకుంటుండగా డ్రైవర్ మల్లికార్జున్‌రావు ట్రాక్టర్‌ను రీవర్స్ తీస్తున్న సమయంలో బాలుడిని ఢీకొట్టాడు. గాయపడిన బాలున్ని నేరేడుచర్లలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

## కోరం లేక మున్సిపల్ సమావేశం నేటికి వాయిదా



కౌన్సిల్ సమావేశంలో కూర్చున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు, కోఆప్షన్‌లు

**యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్‌తో పాటు కోఆప్షన్ సభ్యులు, అధికారులు మాత్రమే హాజరయ్యారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు 10 మంది కౌన్సిలర్లు, నలుగురు కో ఆప్షన్ సభ్యులు కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాల్సి ఉంది. కానీ ఇందులో వైస్ చైర్మన్ కాటంరాజుతో పాటు 10 మంది కౌన్సిలర్లు గైర్హాజరు అయ్యారు. దీంతో సరైన కోరం లేనందున్న కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ రెడ్డి శనివారానికి వాయిదా వేశారు.

**ఇటీవలనే అవిశ్వాసం..**

యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కౌన్సిల్‌లో ఉన్న 11 మంది కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని పెట్టారు. ఇందుకు సంబంధించిన అవిశ్వాస పత్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతికి సైతం జనవరి 30న అందజేశారు. కొంత కాలంగా మున్సిపాలిటీలో చైర్ పర్సన్ వర్సెస్ కౌన్సిలర్లు అన్నట్లు కొనసాగుతుంది. ప్రతి సమావేశంలో చైర్ పర్సన్ తనకు ఇష్టం వచ్చినట్లు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందని, అందుకే తాము అవిశ్వాసం పెట్టామని అప్పట్లోనే కౌన్సిలర్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి సైతం బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఐ, ఇండిపెండెంట్‌కు చెందిన కౌన్సిలర్లు హాజరుకాలేదని తెలుస్తుంది.

## నల్లమలలో పెరిగిన వన్య ప్రాణుల సంఖ్య

**చందంపేట :** నల్లమల అటవీ ప్రాంతంలో గతంలో పోల్చితే వన్య ప్రాణుల సంఖ్య పెరిగిందని ఎఫ్ఆర్‌వో సాయి ప్రకాశ్ పేర్కొన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులు, జంతువుల దాహార్తిని తీర్చేందుకు శాసర్ పిట్స్(నీటి తొట్టి)లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్ డ్యామ్‌లు, శాసర్ పిట్స్ ద్వారా క్రమక్రమగా నల్లమల అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంఖ్య పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. ట్రాప్ కెమెరాల ఆధారంగా వన్య ప్రాణుల గణన జరుగుతుందన్నారు. ఇటీవల ఉమ్మడి చందంపేట మండలాన్ని ఆనుకొని ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కిన వన్య ప్రాణుల ఫొటోలను అటవీ శాఖ అధికారులు విడుదల చేశారు.



నల్లమల అటవీ ప్రాంతంలో తొట్టిలో నీటిని నింపుతున్న సిబ్బంది











అటవీ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కిన వన్య ప్రాణుల చిత్రాలు

### విగ్రహాలకు నిప్పుపెట్టిన దుండగులు

**ఆత్మకూరు (ఎస్) (సూర్యాపేట) :** మండల కేంద్రంలోని శివాలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దేవుడి విగ్రహాలను తగులబెట్టారు. స్థానికులు భక్తులు తెలిపిన వివరాల ప్రకారం..ఆలయంలో దీపం వెలిగించేందుకు సిద్ధంగా ఉంచిన నూనెను విగ్రహాల మీద చల్లి నిప్పంటించారని తెలిపారు. దేవాలయంలో హుండీ కన్పించడం లేదని వెండి విగ్రహాలు సైతం కాలినట్లు తెలిపారు. ఘటనపై స్థానిక భక్తులు నగిరే పర్వతాలు, తండు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

**మోత్కూర్ :** గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈసంఘటన మోత్కూర్ మండలంలోని సదర్శాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దొండ యాదయ్య ఇంటికి తాళం వేసి గొర్రెలు మేపడానికి ,భార్య కూలి పనులకు వెళ్లడంతో ఇంటికి తాళం వేశారు. మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి సందుక పెట్టెలో ఉన్న రూ.53 వేల నగదును దోచుకెళ్లారు. బాధితుడు ఇంటికి వచ్చేసరికి దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### దోపిడీ దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

**భువనగిరి :** దోపిడీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సీఐ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన చుంచు బాబు గత ఫిబ్రవరి 26న రాత్రి సమయంలో భువనగిరి పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపం నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి ఆటోను అడ్డగించి చేతులతో కొట్టి, కత్తితో చంపుతానని బెదిరించి తన ఆటోతో పాటు సెల్ ఫోన్‌ను తీసుకునిపోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. దోపిడీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తి మేడ్చల్ జిల్లా ఘటకేసర్ మండలం అన్నోజిగూడ గ్రామానికి చెందిన గణపురం నిఖిల్‌గా గుర్తించారు. ఇతడు దోపిడీలకు పాల్పడిన కేసులో జైలు జీవితం కూడా గడిపాడు. గత ఫిబ్రవరిలో జైలు నుంచి విడుదలయ్యాడు. పట్టణంలోని అర్బన్‌కాలనీలోని తన బంధువు ఇంటికి వచ్చినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రూ.75వేలు విలువ చేసే ఆటో, రెండు సెల్‌ఫోన్లు, కత్తి స్వాధీనం చేసుకున్నారు.

### భర్తకు తల కొరివి పెట్టిన భార్య

**యాదగిరిగుట్ట రూరల్:** అనారోగ్యంతో మృతిచెందిన భర్తకు భార్య తల కొరివి పెట్టింది. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మారబోయిన నర్సయ్య (59) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి సమయంలో గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అతనికి పిల్లలు లేకపోవడంతో, ఒక అనాథ బాలుడిని పెంచుకుంటున్నారు. అకస్మాత్తుగా మృతి చెందిన భర్తకు భార్య విజయలక్ష్మి తల కొరివి పట్టి అంత్యక్రియలను పూర్తి చేసింది. నర్సయ్య మరణం పట్ల సర్పంచ్ తోటకూరి బీరయ్య, ఆరె మల్లేష్, సోకం మల్లేష్ సంతాపం తెలిపారు.

## వరిలో జీవశాస్త్ర పద్ధతుల ద్వారా సమగ్ర సస్యరక్షణ

- సూర్యాపేట మండల వ్యవసాయాధికారి ఎండి.జానిమియా సూచనలు

పాడి పంట

**నడిగూడెం :** ప్రస్తుత రబీ సీజన్‌లో వరిచేలు పొట్ట దశలో ఉన్నాయి. నిత్యం వరిలో పురుగులు, తెగుళ్లు ఆశించి పంటను నష్టపరుస్తుంటాయి. ఇలాంటి సమయంలో రైతులు రసాయన పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. అయినాగానీ కొన్ని రకాలు పురుగులు నివారణ జరగడంలేదు. ఇలాంటి సమయంలో కేవలం రసాయన మందులను ఉపయోగించకుండా జీవ శాస్త్ర పద్ధతుల ద్వారా చీడ, పీడలను నివారించవచ్చని సూర్యాపేట మండల వ్యవసాయాధికారి ఎండి.జానిమియా చెబుతున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..ఈ దశలో వరి చేల సమగ్ర సస్యరక్షణలో జీవ శాస్త్రపరంగా ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. ప్రకృతిలో పైర్లకు హాని చేసే పురుగులు, మేలు చేసే పురుగులు ఉన్నాయి. కొన్ని పైర్లకు హాని చేస్తాయి. ఇవి శత్రు పురుగులు. ఈ పురుగులను తినే పురుగులను మిత్ర పురుగులు అంటారు. వరి జీవావరణ వ్యవస్థలో కీడు చేసే పురుగుల కన్నా మేలు చేసే పురుగులే ఎక్కువగా ఉన్నాయి. ఈ పురుగులను మూడు రకాలుగా విభజించవచ్చు. భక్షకాలు (పరాన్న భుక్కులు), బదనికలు (పరాన్నజీవులు), వ్యాధి జనకాలు



గుడ్లను తింటున్న తూనీగ



గుడ్లను తింటున్న అక్షింతల పురుగు

- **భక్షకాలు(పరాన్న జీవులు):** హాని కలిగించే పురుగు తల్లి పురుగు, గొంగళి పురుగును గుడ్లనుకాని ఆహారంగా తీసుకుంటాయి. సాలె పురుగు ఇవి వరిని ఆశించే శత్రు పురుగులపైన ముఖ్యమైన భక్షకాలు. పిల్ల, తల్లి సాలె పురుగులు దోమ, కాండం తొలిచే పురుగు, పచ్చదోమ, ఆకుముడత పురుగులను భక్షిస్తాయి. రోజుకు 5–15 శత్రు పురుగులను తింటాయి. ఒక సాలె పురుగు క్రిమిసంహారక మందుల కన్నా ఎక్కువ లాభం చేకూర్చుతుంది.
- **తూనీగలు:** వీటి పిల్ల పురుగులు నీటిపై నుంచి వరి దుబ్బుల పైకిపోయి దోమ పిల్ల పురుగులను తింటాయి. తూనీగలు వరిపైరుపై తిరుగుతూ పచ్చ దోమలను, ఆకు ముడత పురుగు గుడ్లను తింటాయి.
- **నల్లులు:** పచ్చ నల్లులు, తల్లి పురుగులు తల నల్లగా ఉండి, పిల్ల పురుగులు పచ్చగా ఉంటాయి. ఇవి దోమ గుడ్లను దోమలును అమిత ఇష్టంగా తింటాయి. ఒక నల్లి 7–10 గుడ్లను, 2–5 దోమలును ఒక రోజులో తింటాయి.
- **అక్షింతల పురుగు:** పగలు చురుకుగా ఉండి దుబ్బుల పైభాగాన ఉండి ఆకుముడత గుడ్లను తింటాయి. వీటి పిల్ల పురుగులు చురుకుగా ఉండి రోజుకు 5–10 దోమలును తింటాయి.
- **బారు మీసాల మిడత:** దీని మీసాలు శరీర పొడవు కంటే రెట్టింపు ఉంటాయి. ఇవి రాత్రులందు చురుకుగా ఉండి వరినల్లి కాండం తొలిచే పురుగు గుడ్ల సముదాయాన్ని సుడి దోమలును తింటాయి.
- **బదనికలు:** (పరాన్న జీవులు): శత్రు పురుగుల మీద ఆధారపడి దాని గుడ్డు, లార్వా, కోశస్థ దశ మీద గానీ, లోపల గానీ జీవిత చరిత్రను పూర్తి చేసుకొని, వాటిని చంపి, అందులో ఉండి పరాన్న జీవులు బయటకు వస్తాయి.
- **గుడ్లు పరాన్న జీవులు:** ఇవి చిన్న కందిరీగలు. ఇవి ఆకుముడత, కాండం తొలుచు పురుగు గుడ్ల మీద గుడ్డు పెట్టి అందులో పెరిగి జీవిస్తున్న పరాన్న జీవులు బయటకు వస్తాయి.
- **లద్దె పరుగులను ఆశించే పరాన్న జీవులు:** వరి పంటను ఆశించేలార్వాలపై కందిరీగ గుడ్లు పెడుతుంది. ఈ పరాన్న జీవి పిల్ల పురుగులు పంటకి హాని చేసే లార్వాలపై ఆశించి నాశనం చేస్తాయి. ఈ కందిరీగలు 4–7 రోజులు బతుకుతాయి.
- **కోశస్థ దశను ఆశించే పరాన్న జీవులు:** బాక్టీరియా కందిరీగలో ఆకుముడత కోశస్థ దశలో ఆశించి వాటిని నాశానం చేసి, పరాన్న జీవులు బయటకు వస్తాయి.
- **వ్యాధి జనకాలు :** మనుషులకు రోగాలను ఎలిగించే క్రిములున్నట్లే జబ్బులను కల్గించే క్రిములు కూడా ఉన్నాయి. వీటిలో బెవేరియా వంటి బూజు జాతికి చెందిన శిలీంద్రాలు కాండం తొలిచే పురుగు మీద, ఎన్‌పీవీ. అనే వైరస్ రెల్లరాల్చు పురుగు మీద వ్యాధులు కలిగించడం వలన అవి చలవ రహితమై నశిస్తాయి. కాబట్టి వరిలో జీవావరణ వ్యవస్థలో ఎన్నో మిత్ర పురుగులు, శత్రు పరుగులను ప్రకృతి సిద్ధంగా నియంత్రిస్తున్నాయి. కాబట్టి రైతులు పైరు తొలి దశలలో పురుగు మందులు వాడకుండా మిత్ర పురుగుల వృద్ధి అయ్యేటట్లు చూడాలి. అందు కోసం రైతులందరూ పొలంబడి కార్యక్రమంలో పాల్గొనాలి.

కనీసం వారానికి ఒక్కసారైనా రైతులు స్వయంగా పొలాల్లో తిరిగి వివిధ దశల్లో పైరు పెరుగుదల, చీడ, పీడల ఉనికిని క్రిమి కీటకాదులను నిశితంగా పరిశీలించి, పొలం పరిసరాల విశ్లేషణ శత్రు, మిత్ర కీటకాల మదింపు చేసుకొని రైతులు ఆర్థిక వ్యయం నిర్ణయం తమ పంటపై తీసుకోవాలి.


సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE FOR SALE

■ 2020 Model SCV-LEYLAND Dost Plus Reg No. TS 05-UE-1871 is Ready for sale in as where is in Condition Contact Sundaram finance Ltd, Nalgonda. Cell: 9440909834, 8331998431 [Y-784317]

■ 2020 Model John Deer Harvester Reg No. TS 30-G-3585 is Ready for sale in as where is in Condition Contact Sundaram finance Ltd, Nalgonda. Cell: 9491399940, 8333900401 [Y-784318]

Real Estate

■ అర ఎకరం రూ.9,99,999/– మాత్రమే 200 ఎర్రచందనం మొక్కలు+ 12 సంవత్సరాల ఫ్రీ మైంటెనెన్సు+ 100% సెక్యూరిటీ+ డ్రిప్ ఇరిగేషన్+ పట్టాదారు పాసుబుక్ మరియు స్పాట్ రిజిస్ట్రేషన్ ఉగాది వరకు మాత్రమే. దర్శి, ప్రకాశం జిల్లా © 9396211097 [G-399]

FOR SALE

■ మిర్యాలగూడలో డాక్టర్స్ కాలనీ నందు పడమర ఫేస్ గల 2 అంతస్తుల (2 Floors Building) భవనము అమ్మబడును. సంప్రదించవలసిన ఫోన్ : 9703388855 [Y-784203]

■ నల్లగొండ ప్రకాశంబజార్‌లో మంచి రన్నింగ్‌లో ఉన్న ప్రముఖ Kids & Men's wear అమ్మకమునకు కలదు. వెంటనే కంటిన్యూగా రన్ చేసుకోవచ్చు. గ్రౌండ్ ఫ్లోర్ + ఫస్ట్ ఫ్లోర్ సంప్ర॥ సెల్ : 9247272429 [Y-1146104]

PLOT FOR SALE

■ నల్లగొండ దుప్పలపల్లి రోడ్డులో మున్సిపాలిటి పరిధిలో గల క్లియర్ టైటిల్ ప్లాట్లు అమ్మబడును. సంప్ర॥ సెల్: 8074845333, 9912215336 [Y-784312]

Services

INVESTMENT

■ భూమి పైన పెట్టుబడి పెట్టే వారికి సువర్ణ అవకాశం, యాదగిరి గుట్టకి దగ్గరలో 242Sq. కొనండి. ప్రతినెలా అద్దె పొందండి. ఫోన్ : 9182282332. [H-787450]

డాక్యుమెంట్ పోయినది

■ గర్కనేటుతండా నుండి పెద్దవూరలో గల జీరాక్స్ షాపులో 690/1999 & 783/1990 అను నెంబర్‌లు గల ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి. దొరికినవారు సంప్ర॥ బాణావత్ సుశీల తండ్రి రమావత్ సామ్య, ఇ.నెం.2–116 గ్రా॥గర్కనేటుతండా, మం॥ పెద్దవూర, జి॥నల్లగొండ. సెల్: 9849615306 [Y-784316]

CONSULTANT

■ Concord IT Systems INC. Filing H1B for the fiscal year 2023-24, 100% approval rate. Immediate GC processing for deserving consultants. Send your resume at Info@concorditsystems.com +13139693206 / +91 83286 37311 / +91 70954 90108 [H-793342]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781924]

■ అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730899503 [G-502]

■ లేపాక్షి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పెషేంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 20K. ఏజెంట్ కమీషన్ 5K. Ph: 9640300074 [HA-1047]

■ sales exe job in kodad water plant Pvt ltd Sal : 15k - 25k +ESI, PF, PH : 8886661251, 9505258888 [HA-9768]

■ పనివారు కావలెను. హైదరాబాద్, భువనగిరిలో గల చిన్న కుటుంబానికి ఇంట్లోనే ఉండి వంటపని, ఇంటిపని, డ్రైవింగ్, గార్డెనింగ్ మొ॥ పనులు చేయుటకు భార్యాభర్తలు కావలెను. డి.బాలాజీ, భువనగిరి. ఫోన్ : 92469 69042, 98481 75211 [V- 1767]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి చిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.